ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 61

బుధవారం 10 సెప్టెంబర్ 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD




యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ హైస్కూల్ లో "బాస్" స్కీములో చదువుతున్న స్టూడెంట్స్.

## "బాస్" నిధులివ్వు... సీఎం రేవంత్ రెడ్డి సారూ!!

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను నిర్వీర్యం చేయొద్దు

ఎస్.సీ, ఎస్టీ స్టూడెంట్స్‌ను ఆదుకోసారూ... 4



ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ విద్య ను దూరం చేయకు

గుట్ట ఎస్.వీ.ఎన్ కు నాలుగేళ్ల నుంచి నిధులు లేవు...

మరి తిండి ఎట్లా పెట్టాలి సారూ...!?

పెండింగ్ లో రూ.210 కోట్లు

అప్పులు కట్టలేకపోతున్నాం:శేఖర్ రావు యాదగిరి

బడులు తెరిచి నాలుగో నెల అయినా పట్టించుకోరా సారు?

'ప్రభుత్వం మాకివ్వాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయకుండా స్కూళ్లను నడపటం కష్టంగా ఉంది.. సిబ్బందికి జీతాలెలా ఇవ్వా లి. బంగారం, వెండి, సర్వం తాకట్టు పెట్టి, ఇప్పటి వరకు ఎలాగోలా బండి లాగాం. ఇక నడపటం మావల్ల కాదు. స్కూళ్ల పేరుమీద తీసుకున్న లోన్లు చెల్లించకపోవటంతో బ్యాంకర్లు వచ్చి స్కూళ్లకు నోటీసులు అంటించి వెళ్తున్నారు. మాకొద్దు ఈ స్కీమ్, మా స్కూ ళ్లను ప్రభుత్వానికే అప్పగిస్తాం.. వారినే నడు పుకోమనండి'

ఇది ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఆవేదన...

ఈ విద్యార్థుల భవితవ్యం ఏమిటి..?

## గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత

మెయిన్స్ పునః మూల్యాంకనం చేయండి

కుదరకపోతే తిరిగి పరీక్ష నిర్వహించండి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు ఆదేశం



## నిరుద్యోగులకు న్యాయం చేయాలి

గ్రూప్-1 పరీక్షలు తిరిగి నిర్వహించాలి..

హైకోర్టు తీర్పు ఓ గుణపాఠం కావాలి

హైకోర్టు తీర్పును స్వాగతించిన కెటీఆర్



2



# ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

452 ఓట్లు పొందిన ఎన్డీయే కూటమి అభ్యర్థి

ఇండీ అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు

రాధాకృష్ణన్‌కు అభినందనల వెల్లువ

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ అభినందనలు

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. ఎన్నికల పోలింగ్ పక్రియ సాయంత్రం 5 గంటలకు ముగియగా, ఓట్ల లెక్కింపు అనంతరం రాత్రి 7:30 గంటలకు ఫలితాలు వెలువరించారు. ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు- రాగా, ఇండి కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి.



04

### హిమాచల్ వరద ప్రాంతాల్లో ప్రధాని ఏరియల్ సర్వే

తక్షణ సాయంగా 1500 కోట్లు ప్రకటించిన ప్రధాని



.. వివరాలు 3లో

### ఆపరేషన్ సిందూర్‌లో 400 శాస్త్రవేత్తల సేవలు

ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్ వెల్లడి



.. వివరాలు 2లో

### మావోయిస్ట్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి

తిరుపతి అలియాస్ దేవ్‌జీ స్వస్థలం కోరుట్ల

.. వివరాలు 2లో

# సాయం చేయండి

ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ఆర్థిక సాయం అందించండి

- వరదలు, వర్షాల వల్ల దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఆదుకోండి
- రుణాల రీస్ట్రక్చర్‌కు అనుమతించి భారం తగ్గించండి
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలమ్మకు సీఎం రేవంత్ వినతి

ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రేవంత్ రెడ్డి సోమ వారం కలిశారు. వివిధ ఆర్థిక, అభి వృద్ధి అంశాలపై చర్చించారు. ము ఖ్యంగా, గత ప్రభుత్వం తీసుకున్న అధిక వడ్డీ రుణాలను రీస్ట్రక్చర్ చే యాలని, విద్యారంగ అభివృద్ధికి స హకరించాలని కేంద్ర మంత్రిని కోరా రు. గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు తీసుకున్న అప్పులు ప్రభు త్వానికి భారంగా మారాయని వివ రించారు. ఈ రుణాల చెల్లింపులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిరిగి చెల్లించడానికి లోన్ రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.



**రోమింగ్ న్యూస్, న్యూఢిల్లీ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈమేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన నష్టంపై ఆర్థికమంత్రికి నివేదిక అందజేశారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. రేవంత్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు.

మిగతా 2 లో




## గచ్చిబౌలిలో 600 గజాల కబ్జా స్థలం స్వాధీనం

హైడ్రా ఆపరేషన్‌లో పార్క్ స్థలానికి రక్షణ 04

గచ్చిబౌలిలో రూ.11 కోట్ల విలువైన 600 గజాల స్థలాన్ని కాపాడినట్లు హైడ్రా ప్రకటించింది. ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లే అవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాన్ని అక్రమంగా అమ్మారని హైడ్రాకు ఫిర్యాదు వచ్చింది.


### రూ.10 లక్షల లంచం డిమాండ్

- రూ.4 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నర్సింగి మహిళా టీపీవో



02

### హవాలా మార్గంలో నైజీరాయాకు డబ్బు



ఈగిల్ దాడుల్లో 3కోట్ల పైచిలుకు డబ్బు స్వాధీనం 03

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
10 సెప్టెంబర్
2025





# ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ఆర్థిక సాయం అందించండి

మొదటి పేజీ తరువాయి

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు , వరదల వల్ల సంభవించిన నష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనాలను ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి ఇచ్చింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. తెలంగాణలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రత్యేక నిధులతో పాటు, రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ భేటీలో రాష్ట్రంలోని వివిధ ఆర్థిక, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, గత ప్రభుత్వం తీసుకున్న అధిక వడ్డీ రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని, అలాగే, తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు తీసుకున్న అప్పులు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ రుణాల చెల్లింపులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిరిగి చెల్లించడానికి లోన్ రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యారంగం అభివృద్ధికి కేంద్రం అండగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా, యంగ్ ఇండియా స్కూల్స్, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి ...30 వేల కోట్లు- మంజూరు



చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ- వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే యంగ్ ఇండియా స్కూల్స్ పథకం ముఖ్య ఉద్దేశ్యం. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయని ఆయన తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందని, మొత్తం 2.70 లక్షల మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో లబ్ధి పొందుతారని చెప్పారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ...21 వేల కోట్లు- ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, మౌలిక వసతుల కల్పనకు ...9 వేల కోట్లు- అవసరమని సీఎం తెలిపారు. ఈ నిధుల సమీకరణ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు-, పరిమితి నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కూడా ఆయన కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.



# గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత

**మెయిన్స్ పునః మూల్యాంకనం చేయండి**

**కుదరకపోతే తిరిగి పరీక్ష నిర్వహించండి**

**తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** గ్రూప్-1 మూల్యాంకనం, ర్యాంకింగ్ లిస్ట్‌పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మార్చి 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. సంజయ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పునఃమూల్యాంకనం జరపాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. ఈ ప్రక్రియను 8 నెలల్లోపు పూర్తిచేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇలా చేయని పక్షంలో మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాల్సి వస్తుందని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. గ్రూప్-1మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు.. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపి-కై-న అభ్యర్థులు మరికొందరు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జులై 7న న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు వాదనలు విన్నారు. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించారు. పునఃమూల్యాంకనం సాధ్యం కాకపోతే ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయింది. ఈ పిటీషన్లపై జూలై 7న వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీ-జీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది సెలెక్ట్ కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తన తీర్పును వాయిదా వేస్తున్నట్టు- జూలై 7న ప్రకటించారు. తాజాగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా రీవాల్యుయేషన్ జరిపించాలని టీ-జీపీఎస్సీని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.

# కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

**నల్లగొండలో నమోదైన కేసుల కొట్టివేత**

**హైదరాబాద్,సెప్టెంబర్ 9:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. నల్గొండలో వేర్వేరు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన మూడు కేసులను కొట్టివేసింది హైకోర్టు. గతేడాది జరిగిన పదోతరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీక్‌పై కేటీఆర్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుల మేరకు మూడు పోలీస్ స్టేషన్‌లలో కేటీఆర్‌పై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేటీఆర్ తమ పేర్లను ఎలా చెబుతారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేటీఆర్‌పై కేసులను నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులను కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు కేటీఆర్.

# 10 లక్షలు లంచం డిమాండ్

**రూ.4 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నర్సింగి మహిళా టీపీవోజి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** హైదరాబాద్ శివారులోని నర్సింగి మున్సిపాలిటీలో ఓ మహిళా అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మణిహారిక మంగళవారం లంచం స్వీకరిస్తుండగా అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఓ బాధితుడికి చెందిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దస్త్రాలపై సంతకం చేసేందుకు మణిహారిక రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఆమెకు ఇప్పటికే కొంత మొత్తాన్ని ముట్టజెప్పినట్లు తెలిసింది. మిగిలిన మొత్తంలో భాగంగా రూ.4 లక్షలు మంగళవారం తన కార్యాలయంలో స్వీకరిస్తుండగా, ముందుస్తు సమాచారంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, మణిహారికను అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఏసీబీ కోర్టులో హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

**ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ఏసీబీ • గవర్నర్ అనుమతి కోరే అవకాశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఏసీబీ స్పీడ్ పెంచింది. ఈ కేసుకు సంబంధించిన నివేదికను ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని నివేదిక పంపారు. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్‌ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించింది. అనుమతి రాగానే ఇద్దరిపై ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్టు- సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీ-ఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై నమోదైంది. 9 నెలల పాటు- ఈ కేసును విచారించిన ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ కేసులో కేటీ-ఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ రావు, ఎఫ్ఈఓ లను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది.. గవర్నర్ అనుమతి రాగానే ఫార్ములా ఈ కార్ రేసులో నిందితులపై చార్జ్ షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫార్ములా ఈ కార్ ఈ రేస్ నిర్వహణ సంస్థకు హెచ్ఎండీఏ చెల్లింపులు జరిపింది. అయితే ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి విదేశీ కంపెనీకి నగదు బదిలీ అయిందని.. దాదాపు రూ.55 కోట్లు- దుర్వినియోగం జరిగినట్లు- ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముగ్గురిపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏ1గా మాజీ మంత్రి కేటీ-ఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కారు కేసులో ఫెమా నిబంధనలు ఉల్లఘించినట్టు- ఈడీ తెలిపింది.

# 17న ప్రజాపాలన దినోత్సవం

**ఏర్పాట్లను సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 9 :** ఈ నెల 17వ తేదీన నిర్వహించే తెలంగాణా ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు- చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై మంగళవారం డా.బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవీ గుప్తా, డీజీపీ డా. జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో సి.ఎస్. రామకృష్ణారావు మాట్లాడుతూ, ఈనెల 17 తేదీన ఉదయం గన్‌పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొంటారని వివరించారు. గన్÷-పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జీ.హెచ్.ఎం.సి కమిషనర్ నోడల్ అధికారిగా ఉంటారని, గన్÷-పార్క్ కు ఫ్లోరల్ డెకరేషన్ తో పాటు-, షామియానా తదితర ఏర్పాట్లు- చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని అని ప్రధాన కార్యాలయాలు, విగ్రహాలు, పర్యాటక ప్రదేశాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు. పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి తగు ఏర్పాట్లను చేపట్టాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా జరిగేలా చూడాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు- తగు తాగునీరు, శానిటేషన్ ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు- చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వీవీఐపీలతో పాటు- ప్రజాప్రతిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ప్రోటోకాల్ శాఖ డైరెక్టర్ శివలింగయ్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, ఎస్.పి.డీసీ.ఎల్ ఎండి ముషారఫ్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు.

# వేగంగా శాసనమండలి పునరుద్దరణ పనులు

**పరిశీలించిన గుత్తా సుఖేందర్,స్పీకర్ గడ్డం ప్రసాద్ రావులు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 9:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణములోని పాత అసెంబ్లీ పనులు చురుకుగా సాగుతున్నాయి. దీనిని మండలిగా మార్చేందుకు పునరుద్దరణ పనులు చేపట్టారు. తెలంగాణ శాసన పరిషత్ భవనం (హెరిటేజ్ బిల్డింగ్) పునర్నిర్మాణ పనులను తెలంగాణ శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి



గడ్డం ప్రసాద్ కుమార్, పరిషత్ డిప్యూటీ- చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో హెరిటేజ్ భవనం అయినందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న సమావేశాలు ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనులను పరిశీలించడానికి వస్తారని, పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా , వేగంగా పూర్తిచేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్అండ్ బి అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో అసెంబ్లీ స్పీకర్ చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# ఆపరేషన్ సిందూర్‌లో 400 శాస్త్రవేత్తల సేవలు

**ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్ వెల్లడి**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9:** ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మంది శాస్త్రవేత్తలు నిరంతరం పనిచేసినట్లు- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్ వీ నారాయణన్ వెల్లడించారు. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ శాటిలైట్ల పనితీరును పరిశీలిస్తూ.. జాతీయ భద్రత అవసరాలకు అనుగుణంగా ఉపగ్రహాల సమాచారాన్ని అందించినట్లు- చెప్పారు. దిల్లీలో జరిగిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని ఉపగ్రహాలు నిరంతరం కచ్చితత్వంతో పనిచేశాయన్నారు. అవసరమైన సమాచారాన్ని అందించాయి.



400లకు పైగా శాస్త్రవేత్తలు 247, పూర్తి సమయం పనిచేశారు. భూ పరిశీలన, కమ్యూనికేషన్ కు సంబంధించిన ఉపగ్రహాలన్నీ సంపూర్ణ సేవలందించాయని పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 7700 క్షేత్రస్థాయి పరీక్షలు పూర్తిచేశామన్నారు. మరో 2300 పరీక్షలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. జాతీయ భద్రత, సరిహద్దు సంక్షోభం వంటి సమయాల్లో అంతరిక్ష రంగం కీలకంగా వ్యవహరిస్తుందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సమయంలో మరోసారి స్పష్టమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో విస్తృతంగా డ్రోన్లు, మందుగుండు సామగ్రి భారీ స్థాయిలో వినియోగించడం, దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్ వంటి రక్షణ వ్యవస్థ సామర్థ్యాలను పరిశీలించడంలోనూ ఇస్రో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఇందుకు సంబంధించి ఆయా శాఖలతో పనిచేస్తోంది.



# మావోయిస్ట్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి

**తిరుపతి అలియాస్ దేవ్‌జీ స్వస్థలం కోరుట్ల**

**ఖమ్మం, సెప్టెంబర్ 9:** మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్’జీని ఆ పార్టీ కేంద్ర కమిటీ- సభ్యులు ఎన్నుకున్నట్లు- సమాచారం. ఈ మేరకు మావోయిస్టు పార్టీ అధికారిక నియామక లేఖ విడుదల చేసినట్లు- ప్రచారం జరిగినా, ఆ లేఖ వెలుగులోకి రాలేదు. అయితే ఈ నియామక విషయం మంగళవారం ప్రచారంలోకి వచ్చింది. మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఇటీవల ఎన్కౌంటర్లో మరణించిన అనంతరం కొద్ది నెలలుగా మావోయిస్టు దళపతి నియామకం జరగలేదు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నంబాల అనంతరం, తాజాగా తెలంగాణ దళిత కుటుంబానికి చెందిన తిరుపతి నియామకం వెలుగులోకి వచ్చింది. మావోయిస్టు పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎందరో దళ సభ్యులు కీలక నాయకులుగా పనిచేసిన చరిత్ర ఉంది. తాజాగా మళ్లీ తెలుగువాడికే మావోయిస్టు పార్టీ దళపతిగా అవకాశం లభించడం ప్రత్యేకతను సంతరించుకుంది. మావోయిస్టు పార్టీ నూతన జాతీయ ప్రధాన కార్యదర్శి తిపిరి తిరుపతి అలియాస్ దేవ్’జీ... సంజీవ్, చేతన్, రామన్న, దేవ్’జీ అనే పేర్లతో దళంలో కీలక బాధ్యతలు పోషించారు. అయితే చిరకాలంగా దళంలో దేవ్’జీ అనే పేరే వాడకంలో ఉంది. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం సమయంలో ఆర్ఎస్ యూ అధ్యక్షునిగా తిరుపతి పనిచేశారు. అనంతరం 1983లో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ తీసుకున్నారు. 1984లో ఆయనను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్’కు తరలించగా,బెయిల్’పై ఇంటికి వచ్చిన తిరుపతి అడ్వకేట్’ను కలిసి వస్తానని వెళ్లి, మళ్లీ ఇంతవరకు తిరిగి రాలేదు. దళంలోకి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులు ఆయన్ని కలవాలని ఎంత ప్రయత్నించినా వీలు కాలేదు. అయన కూడా స్వగ్రామానికి రావడానికి, బంధువులకు కలవడానికి ప్రయత్నించలేదు.దళంలో చేరిన తిరుపతి మొదట మహారాష్ట్రలోని గడిచిరోలి జిల్లా కార్యదర్శిగా సంజీవ్ పేరుతో పనిచేశారు. తదుపరి రాష్ట్ర కమిటీ- సభ్యునిగా చేతన్ పేరుతో, అంతరం మిల్ట్రీ కమిషన్ సభ్యునిగా రామన్న పేరుతో పనిచేశారు. అనంతరం సెంట్రల్ కమిటీ- సభ్యునిగా, పోలిట్ బ్యూరో మెంబర్గా దేవ్’జీ పేరుతో చిరకాలంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం తాజాగా తిరుపతి అలియాస్ దేవజీని నియమించినట్లు- జోరుగా ప్రచారం జరుగుతున్నది.

# ప్రజావాణికి 311 దరఖాస్తులు



**హైదరాబాద్,సెప్టెంబర్ 9:** ప్రజాభవన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మంగళవారం 311 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో గృహ సంబంధిత దరఖాస్తులు 85, పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 76 దరఖాస్తులు, రెవెన్యూ శాఖ కు సంబంధించి 50 దరఖాస్తు లు వచ్చాయి. ప్రవాసి ప్రజావాణి లో మూడు వినతి పత్రాలు సమర్పించారు. ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తు లు వచ్చాయని ప్రజావాణి అధికారులు తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 10 సెప్టెంబర్ 2025



# అక్షరానికి ఆయుధం తొడిగిన కాళోజీ

## తెలంగాణ వాదాన్ని విస్తృతం చేసిన కాళోజీ రచనలు : ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తెలంగాణ భాషకు కాళోజి కవిత్వం జీవనాడి వంటిదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీ.ఎన్ విద్యాసంస్థల అధినేత గొట్టిపర్తి భాస్కర్ అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గొట్టిపర్తి మాధురి, అకాడమిక్ డైరెక్టర్ గొట్టిపర్తి వృత్తిక్ లతో కూడిన బృందం కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భాషకు సంస్కృతికి సజీవ పాఠం ఆయన జీవితం అని చెప్పారు.తెలంగాణ ప్రజల భాషకు వెన్నెల కాంతులు... సూర్యకాంతులు కూడా నింపిన అచ్చమైనతెలంగాణ దార్శనికుడు కాళోజి అని అభివర్ణించారు. పల్లె పదాలకు పట్టాభిషేకం చేసి, జనం భాషకు దివిటీ పట్టిన భాషా శాస్త్ర వేత్తగా కొనియాడారు.

మాటల్లో ప్రజల మనసులను చూపించిన

డైరెక్టరు కాళోజి అని విద్యార్థులకు అవగతం చేశారు. తెలంగాణ మనసు భాషకు బుద్ధి నీరాజనాలందించిన భావుకుడుగా చెప్పారు.

దాగుడుమూతలులేకుండా భావాల మాటలను బుద్ధి మెదడులో పలికించిన సహజ భాషా శాస్త్రవేత్త కాళోజీ అన్నారు.

కాళోజీని చదివితే బుద్ధి కాంతి సాగరమైతదన్నారు. మనిషితనాన్ని పండిస్తది కాళోజీని రాస్తే బుద్ధి వాచకం పాఠాలుచదువడమే...

అచ్చమైన తెలుగుతనం మన కాళోజీ అన్నారు. వారి ప్రసంగం ఇలా సాగింది...సెప్టెంబర్ 9, ఈ రోజు మనకు కేవలం ఒక తేదీ కాదు, ఒక మహాకవి పుట్టిన రోజు. ప్రజాకవి, పద్మవిభూషణ్, కాళోజి నారాయణరావు జయంతి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఈ రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటుంది. ఇది ఒక కవికి ఇచ్చిన గౌరవం కాదు, తెలంగాణ భాషకు, దాని అస్తిత్వానికి, పోరాట స్ఫూర్తికి ఇచ్చిన గౌరవం. కాళోజి కేవలం కవిత్వం రాసి ఊరుకోలేదు. ఆయన కలం ఒక కత్తి, ఆయన పదం ఒక ఆయుధం. ఆయన కవిత్వం తెలంగాణ నేల గుండె చప్పుడు, ఇక్కడి మనుషుల కన్నీళ్లు, ఆశలు అన్నీ మనకు వినిపిస్తాయి.

**"నా గొడవ" అని గర్జించిన అక్షరం,**
**అన్యాయంపై ఎక్కుపెట్టిన అస్త్రం.**
**పేదల గొంతుకగా నిలిచిన పదం,**
**అణగారిన జనాల ఆవేదనా స్వరూపం.**

ఆయన కవిత్వంలో కనిపించేది ప్రజల పక్షం. సరళమైన భాషలో, తెలంగాణ యాసలో ఆయన రాసిన ప్రతి పదం ఒక పోరాటాన్ని సూచించింది.

**"ప్రజల కన్నీళ్లను పలికించని సాహిత్యం...ఎండిన సెలయేరు" అని గట్టిగా చెప్పిన కవి.**
**"అన్యాయం జరిగితే, అదెవ్వరిపైన జరిగినా అన్యాయమే, ఎదురించండి" అని పిలుపునిచ్చిన ధీరుడు.**

ఆయన కవిత్వం తెలంగాణ ఉద్యమంలో ఒక బలమైన శక్తిగా నిలిచింది. ఆయన మాటలు, పాటలు, కవిత్వం వేలాది మందిని ఉద్యమానికి నడిపించాయి. ఆయన హాస్యం, వ్యంగ్యం సమాజంలోని లోపాలను సూటిగా, సరళంగా ఎత్తి చూపాయి.

**తూటా కన్నా పదునైన వాక్యం,**
**కత్తి కన్నా వేగమైన వ్యంగ్యం.**
**కవిత్వం అంటే కేవలం పదాల కూర్పు కాదు,**
**అదొక నిప్పు కణిక, అదొక పోరాటం.**

విద్యార్థులారా, మనం ఈ రోజు కాళోజిని కేవలం ఒక కవిగా చూడటం కాదు, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి. మన భాషను ప్రేమించాలి, మన సంస్కృతిని గౌరవించాలి. అన్యాయం జరిగితే ప్రశ్నించే ధైర్యం మనలో పెంచుకోవాలి. అప్పుడే మనం కాళోజి కలలు కన్న తెలంగాణను నిర్మించగలం. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుని, మనం భవిష్యత్తులో మన సమాజానికి, దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి.

### తెలంగాణ వాదాన్ని విస్తృతం చేసిన కాళోజీ రచనలు : గొట్టిపర్తి భాస్కర్

పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజి నారాయణరావు "నా గొడవ" కేవలం కవితా సంపుటి కాదు. అది తెలంగాణ సమాజంపై సాగిన అన్యాయాన్ని, దోపిడీని, అణచివేతను ప్రశ్నించిన నిరసన స్వరం. ఆయన కలం ఒక కత్తిలా మారి అక్షరాలను అస్త్రాలుగా మలిచి, పదునైన వాక్యాలతో సమాజాన్ని మేల్కొలిపింది. నా గొడవలో పదునెక్కిన ఆయన కవిత్వం నన్ను తీవ్రంగా ప్రభావితం చేసింది. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సమయంలో ప్రతిరోజు ఐదారు సభలలో ప్రసంగించాల్సి వచ్చేది. దీనికోసం ఖచ్చితంగా కాళోజీ కవిత్వాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది.... దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు... తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరించడానికి ఆయన రచనలలోని అంశాలు ఎంతగా ఉపయోగపడింది. తెలంగాణ ఉద్యమకారులు ఆసక్తికర చైతన్యవంతమైన ప్రసంగాలు ఇవ్వాలంటే కాళోజి రచనలు చదవాల్సిందే... ఆయన ఆంధ్ర వలసవాదులకు వేసే ప్రశ్నలకు జవాబులు దొరికేవి కావు... కాబట్టి సభలలో ప్రసంగిస్తున్నప్పుడు కాళోజి మాటలను ప్రస్తావించినప్పుడు జయజయ ద్వానాలు సభల నుంచి వెళ్ళువెత్తేవి.










నిజాయితీ గల ప్రశ్న: కాళోజి కవిత్వం నిష్కర్షగా, నిర్మొహమాటంగా ఉంటుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. "అన్యాయం జరిగితే అదెవ్వరి పైన జరిగినా అన్యాయమే, ఎదురించండి" అంటూ పోరాట స్ఫూర్తిని రగిలించారు.

సామాన్యుడి భాష: "నా గొడవ"లో కాళోజి వాడిన భాష పండితులకు మాత్రమే కాదు, సామాన్యుడికి కూడా అర్థమయ్యే విధంగా ఉంటుంది. తెలంగాణ యాస, నుడికారం, సామెతలు ఆయన కవిత్వానికి మరింత పదును పెట్టాయి. కష్టమైన పదాలు, వ్యాకరణ నియమాలు లేకుండా ప్రజల కష్టాలను, బాధలను చాలా సులభంగా చెప్పారు.

వ్యంగ్యం, హాస్యం: కాళోజి కవిత్వంలో కేవలం ఆవేశం మాత్రమే కాదు, గొప్ప వ్యంగ్యం కూడా ఉంది. "గోలకొండ కవి సమ్మేళనం" లాంటి రచనల్లో ఆయన రాజకీయ నాయకుల ద్వంద్వ నీతిని, సమాజంలోని లోపాలను హాస్యంతో కలిపి ఎత్తి చూపారు. ఈ వ్యంగ్యం నవ్విస్తూనే ఆలోచింపజేస్తుంది.

పోరాట స్ఫూర్తి: కాళోజి కవిత్వం నిరాశను కాదు, పోరాట స్ఫూర్తిని ఇచ్చింది. ప్రజల కన్నీళ్లను పలికించని సాహిత్యం ఎండిన సెలయేరు అని ఆయన నమ్మారు. అందుకే, ఆయన కవిత్వం ఒక ప్రవాహంలా తెలంగాణ ఉద్యమంలో ఒక బలమైన శక్తిగా మారింది. "నా గొడవ"లోని వాక్యాలు ఉద్యమకారులకు నినాదాలుగా మారాయి.

**"తుపాకీ గుండుకు లొంగని తలకాయ,**
**అక్షరానికి ఆయుధం తొడిగిన చేయి.**
**కవిత్వం అంటే కేవలం పదాల కూర్పు కాదు,**
**అదొక నిప్పు కణిక, అదొక పోరాటం."**

ఈ విధంగా "నా గొడవ" కేవలం ఒక కవితా సంపుటిగా కాకుండా, తెలంగాణ చరిత్రలో ఒక సామాజిక పోరాటాన్ని, విప్లవాన్ని ప్రతిబింబించే ఒక ముఖ్యమైన రచనగా నిలిచిపోయింది. తెలంగాణ అస్తిత్వాన్ని తెలంగాణ యాస, భాషా పటిమను తెలుసుకోవాలంటే ఖచ్చితంగా కాళోజీ రచనలు చదవండి.. భాష పై మరింత ప్రభావితం కావడానికి అనునిత్యం రీడింగ్ ఒక అధ్యాయంలాగా ప్రారంభించాలనీ

తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా మీ అందరికి పిలుపునిచ్చారు.






ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
10 సెప్టెంబర్
2025



# "బాస్" నిధులివ్వు...
# సీఎం రేవంత్ రెడ్డి సారూ!!



## బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను నిర్వీర్యం చేయొద్దు

**ఎస్.సీ, ఎస్టీ స్టూడెంట్స్‌ను ఆదుకోసారూ...**



ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు
కార్పొరేట్ విద్యను దూరం చేయకు

గుట్ట ఎస్.వీ.ఎన్ కు నాలుగేళ్ల నుంచి నిధులు లేవు...
మరి తిండి ఎట్లా పెట్టాలి సారూ...!?
పెండింగ్ లో రూ.210 కోట్లు
అప్పులు కట్టలేకపోతున్నాం:శేఖర్ రావు యాదగిరి
బడులు తెరిచి నాలుగో నెల అయినా
పట్టించుకోరా సారు?

**ఈ విద్యార్థుల భవితవ్యం ఏమిటి..?**

హైదరాబాద్, 5 (రోమింగ్ న్యూస్): 'ప్రభుత్వం మాకివ్వాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయకుండా స్కూళ్లను నడపటం కష్టంగా ఉంది.. సిబ్బందికి జీతాలెలా ఇవ్వాలి. బంగారం, వెండి, సర్వం తాకట్టుపెట్టి, ఇప్పటి వరకు ఎలాగోలా బండి లాగాం. ఇక నడపటం మావల్ల కాదు. స్కూళ్ల పేరుమీద తీసుకున్న లోన్లు చెల్లించకపోవటంతో బ్యాంకర్లు వచ్చి స్కూళ్లకు నోటీసులు అంటించి వెళ్తున్నారు. మాకొద్దు ఈ స్కీమ్, మా స్కూళ్లను ప్రభుత్వానికే అప్పగిస్తాం.. వారినే నడుపుకోమనండి' ఇది ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఆవేదన, రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ (బీఏసీ)ను అమలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల పరిస్థితి ఇది. ఎస్సీ, ఎస్టీ పేద వర్గాల విద్యార్థులను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం (బీఏఎస్) లక్ష్యం నీరుగారుతోంది. ఈ పథకం అమలవుతున్న ప్రైవేట్ పాఠశాలల పరిస్థితి ఆందోళనగా తయారైంది. ఈ స్కీమ్ కింద విద్యార్థులకు ఖర్చయ్యే బిల్లులను ప్రభుత్వం సమయానికి విడుదల చేయకపోవటంతో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహణ భారాన్ని తట్టుకోలేకపోతున్నాయి. 2025-26 సంవత్సరం స్కూళ్లను తెరిచి నాలుగో నెల నడుస్తున్నది.

రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల కలెక్టర్లు బలవంతం చేసి జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేసి పాఠశాలల్లో కలెక్టరేట్లో డ్రా తీయగా ఎంపికైన విద్యార్థులను చేర్పించారు.



యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ హైస్కూల్‌లో "బాస్" స్కీములో చదువుతున్న స్టూడెంట్స్

మాది బాధ్యత 15 రోజుల్లో డబ్బులు ఇప్పిస్తామన్నారు... నాలుగో నెల గడుస్తున్నది... బిల్లులు చేసే నాధుడే కరువయ్యాడు. రాష్ట్రంలోని

ఒక్కో జిల్లాలో 5 నుంచి 10 వరకు ఈ స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కీమ్ కింద పాఠశాలల్లో మొత్తం 25,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎస్సీలకు 18 వేలు, ఎస్టీలకు 7 వేల సీట్లు ఉంటాయి. ఈ స్కీం కింద డే స్కాలర్స్, రెసి డెన్షియల్ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనందిస్తారు. ఎస్సీ విద్యార్థులకు ఒకటో తరగతిలో, 5వ తరగతిలో ప్రవేశాలుంటే, ఎస్టీ విద్యార్థులకు మూడు, ఐదు, ఎనిమిదో తరగతిలో ప్రవేశాలుంటాయి. ఇందుకుగానూ హాస్టల్ విద్యార్థి ఒక్కొక్కరికి రూ.42 వేలు, డేస్కాలర్ విద్యార్థికి రూ.28 వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఒక్కొక్కరికీ రూ.1.5 లక్షల చొప్పున ఖర్చుచేస్తున్న ప్రభుత్వం... బీఏఎస్ స్కీం కింద చదువుతున్న వారికి మాత్రం ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు తెలిపాయి.

### మూడేళ్లలో రూ.210 కోట్లు పెండింగ్

బీఏఎస్ స్కీమ్ కింద చేరే విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్లు, కాస్మోటిక్స్, మంచి భోజనం అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం తమకు నిధులు విడుదల చేయకుంటే ఎలా నిర్వహించాలని యాజమాన్యాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని చెబుతు న్నారు. మూడు నెలల వేతనాలను సిబ్బందికి చెల్లించాలి. ఈ స్కూళ్లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు మూడేళ్ల నుంచి పెండింగ్లో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం స్కూళ్లకు ఇవ్వాల్సిన నిధులు రూ.210 కోట్లు ఉన్నాయని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు చెబుతున్నాయి. 2022-23కు సంబంధించి రూ.10 కోట్లు, 2023-24 కు గానూ 75 కోట్లు, 2024-25కు 125 కోట్లు పెండింగ్ లో ఉన్నాయి.

### 2025.26 మొదటి క్వార్టర్ కూడా

అదేవిధంగా 2025 బి26 విద్యా సంవత్సరానికి మొదటి క్వార్టర్ మెస్, ట్యూషన్ బిల్లులు కూడా విడుదల చేయాల్సి ఉంది. అన్ని సజావుగా సాగి ఉంటే మొదటి క్వార్టర్ నిధులు విడుదల అయ్యేవి.

### అప్పులు కట్టలేకపోతున్నాం

జూన్ 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభంకానుంది. ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేయకపోవటంతో దాదాపు 100 స్కూళ్ల యాజమాన్యాలు మంగళవారం అత్యవసర సమావేశాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేసి తీర్మానం చేశాయి. పెండింగ్ నిధులు విడుదల చేయకుంటే జూన్ 12 నుంచి స్కూళ్లకు తాళాలు వేసి, ఆ తాళాలను ప్రభుత్వానికే ఇస్తామంటున్నారు. తాము స్కూళ్లను నిర్వహించలేమని, ప్రభుత్వమే నడుపుకోవాలని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు స్పష్టం చేశాయి.

### నాయకుల చుట్టూ తిరుగుతున్నాం




ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లు లు చెల్లించకుంటే మాకు చావే శరణ్యం. మేము రాజీవ్ యువవికాసం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి ప్రభుత్వ పథకాలను ఇవ్వమని అడగటం లేదు. మా డబ్బులు మాకివ్వమని అడుగుతున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ల చుట్టూ చాలా సార్లు తిరిగి, అలసిపోయాం. ఆఖరికీ సీఎంను కలిసి కూడా మా సమస్య ను విన్నవించాం. కానీ ప్రభుత్వం ప ట్టించుకోవటం లేదు. ఇక బడులను నడపలేం. ప్రభుత్వం ఇచ్చే స్కూళ్ల అనుమతిపత్రాల (రికగ్నేషన్ సర్టిఫికె ట్)లతోపాటు ఉన్నదంతా తాకట్టుపెట్టి స్కూళ్లను నడిపించాం. ఒక్కో స్కూల్పై రూ.2 కోట్ల వరకు అప్పు ఉంది. ఇక నడపటం మా వల్ల కాదు. స్కూళ్లకు తాళాలు వేసి ప్రభుత్వానికే ఇచ్చేస్తాం. వారిష్టం ఏమైనా చేసుకోండి. తెచ్చిన అప్పులకు ఈఎంఐలు చెల్లించలేకపోతున్నం

- యాదగిరి శేఖర్ రావు, ట్రస్మా గౌరవ అధ్యక్షులు, బీఏఎస్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి

### ఈ ఏడాది ఆరంభంలోనే 15 రోజుల్లో పాత బకాయిలు ఇప్పిస్తామన్నారు:

యాదాద్రి జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎస్.సీ విభాగంలో 8 పాఠశాలలు, ఎస్టీ విభాగంలో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ఎస్.వీ. ఎన్ హైస్కూల్ కొనసాగుతున్నాయి. ఐదు సంవత్సరాలుగా పాఠశాలకు రావాల్సిన బకాయిలు రావడం లేదు.జిల్లా కలెక్టర్, జిల్లా ట్రైబల్ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్లను కలిసి ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించినా మా చేతిలో ఏముంది..? ప్రభుత్వం ఇవ్వాలి కదా అంటూ దాటవేశారు. జూన్ నెలలో మాత్రం డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసాక మాది బాధ్యత 15 రోజుల్లో ప్రభుత్వం డబ్బులు విడుదల చేస్తుంది...ఇప్పించే బాధ్యత మాది అని చెప్పి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు.2025బి26 విద్యాసంవత్సరం పాఠశాల మొదలై నాలుగో నెల నడుస్తున్నది... ఇప్పటికే మొదటి క్వార్టర్ డబ్బులు విడుదల కావాల్సి ఉంది. మూడు నెలలకు ఒకసారి నిధులు విడుదల చేస్తామని చెబితే ఈ స్కీమును అంగీకరించాం... కానీ ఐదు సంవత్సరాల నుంచి మాకు నయా పైసా రావడం లేదు... ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలను నడపడం కష్టంగా ఉంది... పాఠశాలలో చదువుతున్న ప్రతి స్టూడెంట్ కు భోజనం, బోధన వసతులు అందించిన మీదటనే డబ్బులు విడుదల చేయమని అడుగుతున్నాం... ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో నెల నెలా నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల పట్ల శీతకన్నుతో వ్యవహరించడం బాధాకరం.

- గొట్టిపర్తి భాస్కర్, ఎస్.వీ.ఎన్ ఫౌండర్. యాదగిరిగుట్ట.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 10 సెప్టెంబర్ 2025



# కేసీఆర్ స్ఫూర్తితో జాగృతి పోరాటం

- అందరినీ కలుపుకుని సామాజిక తెలంగాణ కోసం పోరు
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగానూ అంజలి ఘటించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. ఉన్నతమైన ఆశయాలతో అడుగు వేయాలని ఆలోచిస్తున్నాం. ఉన్నతమైన లక్ష్యం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయి. సామాజిక తెలంగాణ సాధించే వరకు జాగృతి కార్యకర్తలు విశ్రమించబోరని అన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తాం. కాళోజీ స్ఫూర్తితోనే అందరమూ పని చేశాం.. పని చేస్తాం. ఐలమ్మ స్ఫూర్తితో అందరూ విజృంభించి అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాధనలో బొంత పురుగునైనా ముద్దాడుతానన్న కేసీఆర్ స్ఫూర్తితో ముందుకు పోతామని కవిత చెప్పుకొచ్చారు. లెఫ్ట్ టు- రైట్ అందర్నీ కులుపుకుని ముందుకు వెళతామన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి వచ్చుంటే సామాజిక తెలంగాణ కోసం కృషి చేసేవారని కవిత పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకుని రాజకీయంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారామె. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కీలక కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచే హైదరాబాద్‌కు తాగునీటి కోసం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రూ. 1500 కోట్ల ప్రాజెక్టును రూ. 7,500 కోట్లకు పెంచారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సొమ్మును మెగా కృష్ణా రెడ్డికి దోచి పెడుతున్నారంటూ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కుంభకోణంలో భాగంగానే ప్రాజెక్టు అంచనాలు పెంచారని ఆరోపించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికపై జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ సుదర్శన్ రెడ్డి గెలవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్ రెడ్డి వన్నె తెస్తారని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంకితభావం ఉందన్నారు.




## ఆర్‌టిసి కొత్త పథకం
# యాత్రాదానం

**పెద్దల బర్త్‌డే రోజు పేదలకు పుణ్యతీర్థ సందర్శన**

**పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్,సెప్టెంబర్ 9:** సామాజిక బాధ్యతలో భాగంగా 'యాత్రాదానం' అనే వినూత్న కార్యక్రమానికి టిజిఎస్ ఆర్‌టిసి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంగళవారం యాత్రాదానం కార్యక్రమ పోస్టర్ ను రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తో పాటు- ఈడీలు మునిశేఖర్, రాజశేఖర్, ఖుస్రోషా ఖాన్, వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, హెచ్‌ఓడీలు శ్రీధర్, శ్రీదేవి, ఉషాదేవి, ప్రభులత, కవిత, తదితరులు పాల్గొన్నారు. యాత్రదానం కార్యక్రమ నిర్వహణ కోసం పేరుతో ప్రత్యేక నిధిని సంస్థ ఏర్పాటు- చేసింది. వ్యక్తులతో పాటు- ప్రజా ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌ఆర్‌ఐలు, అసోసియేషన్స్, ఎన్‌జిఓలు స్పాన్సర్ చేసి అనాథలు, నిరాశ్రయులైన వృద్దులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ దేవాలయాలకు, పర్యాటక ప్రాంతాలకు, విహారయాత్రలకు తీసుకెళ్లొచ్చు. సంతోషకరమైన రోజుల్లో ఈ కార్యక్రమం ద్వారా ఇతరుల్లోనూ ఆనందం కలిగించవచ్చు. ఈ యాత్రాదాన కార్యక్రమాన్ని వ్యక్తులు, కుటు-ంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కూడా వినియోగించుకోచ్చు. యాత్రాదాన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను కవర్ చేస్తే ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సంస్థ రూపొందించింది. దాతలు చెల్లించే విరాళం మేరకు కిలోమీటర్ల ఆధారంగా ఎసి, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సులను విహారయాత్రలకు సంస్థ ఏర్పాటు- చేస్తుంది. టూర్ ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటు-ంది. స్థానిక ఆర్‌టిసి డిపో అధికారులను సంప్రదించి యాత్రాదానం కింద బస్సులను బుకింగ్ చేసుకోవచ్చు. ఆర్‌టిసి హెల్ప్ లైన్ నంబర్లు 040 69440000, 040 23450033 కాల్ చేసి సమాచారం ఇస్తే సంబధిత ఆర్‌టిసి అధికారులు ఫోన్ చేసి యాత్రాదాన టూర్ ప్యాకేజీల వివరాలను తెలియజేస్తారు. యాత్రాదాన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వినూత్న ఆలోచనతో యాత్రాదానం కార్యక్రమాన్ని అమల్లోకి తెస్తున్న ఆర్‌టిసి యాజమాన్యాన్ని అభినందించారు. ప్రసిద్ధ దేవాలయాలకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని చాలా మందికి ఉంటుందని, అలాంటి వారికి యాత్రాదానం కార్యక్రమం ఒక వరమని అన్నారు. కార్పొరేట్ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా టిజిఎస్ ఆర్‌టిసి యాత్రానిధికి విరాళాలు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన ర్వాణా సేవలను అందించడంతో పాటు- సామాజిక బాధ్యత గల సంస్థగా ముందుకు వచ్చి యాత్రాదానం అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ అన్నారు. భారతదేశంలోనే మొదటిసారిగా ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమం మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తోందని ఆయన వెల్లడించారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని కోరారు. ముఖ్యంగా సమాజ హితానికి ప్రజా ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జిఓలు యాత్రాదానాన్ని వినియోగించుకోవాలన్నారు. యాత్రాదానం నిధికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్‌టిసి ఎండి సజ్జనార్ చెరో లక్ష రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఈ విరాళానికి సంబందించిన చెక్ లను ఆర్‌టిసి ఉన్నతాధికారులకు అందజేశారు. మంత్రి విరాళాన్ని అనాథలు, నిరాశ్రయులైన వృద్దులకు, నిరుపేద విద్యార్థుల విహారయాత్రలకు వినియోగించనుండగా, ఆర్‌టిసి ఎండి సజ్జనార్ విరాళాన్ని అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు తాడ్ బండ్ లోని సైన్స్ సెంటర్ లో సైన్స్ ప్రయోగాలు వీక్షించేందుకు వెళ్లేందుకు రవాణా సదుపాయం కోసం ఉపయోగిస్తారు.





## గచ్చిబౌలిలో 600 గజాల
# కబ్జా స్థలం స్వాధీనం

**హైడ్రా ఆపరేషన్‌లో పార్క్ స్థలానికి రక్షణ**

**హైదరాబాద్,సెప్టెంబర్ 9:** హైడ్రా ఏర్పాటైన నుంచి హైదరాబాద్ లో ప్రభుత్వ ఆస్తులను సంరక్షిస్తోంది. కబ్జాకు గురైన కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల నుంచి రక్షిస్తోంది. గచ్చిబౌలిలో రూ. 11 కోట్ల విలువైన 600 గజాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి సెప్టెంబర్ 9న కాపాడినట్లు- హైడ్రా ప్రకటించింది. తెలంగాణ సెక్రటేరియట్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ-కి చెందిన 24 ఎకరాల లే అవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాన్ని అక్రమంగా అమ్మారని హైడ్రాకు ఫిర్యాదు వచ్చింది. ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా ఆక్రమణలను తొలగించి పార్కు స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు- చేసింది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు- చేసి పార్కు స్థలాలుగా గుర్తించింది. అక్రమంగా అమ్మకాలు, కొనుగోళ్లు జరిపిన వారిపై విచారణ మొదలు పెట్టింది. ఎవరు అమ్మారు, ఎవరు కొనుగోలు చేశారనే దానిపై దానిపై దర్యాప్తు చేస్తోంది. ఇంకా ఎన్ని స్థలాలు అక్రమంగా అమ్మినారో గుర్తించి కేసులు నమోదు చేయనుంది హైడ్రా. ఇటీ-వలే ఆగస్టు 25న జూబ్లీహిల్స్ లో వంద కోట్ల విలువ చేసే భూమిని హైడ్రా కాపాడింది. జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ-కి ప్రజావసరాల కోసం ఉద్దేశించిన భూమి 20 ఏళ్లుగా కబ్జాకు గురైందని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపిన హైడ్రా అక్రమ నిర్మాణాలను తొలగించింది. మొత్తం వంద కోట్ల రూపాయల విలువైన 2 వేల గజాల స్థలాన్ని కాపాడారు హైడ్రా అధికారులు.

## హిమాచల్ వరద ప్రాంతాల్లో
# ప్రధాని ఏరియల్ సర్వే

**తోణ సాయంగా 1500 కోట్లు ప్రకటించిన ప్రధాని**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:** భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్ కు తక్షణ సాయం కింద ప్రధాని మోదీ రూ. 1500 కోట్ల సాయం ప్రకటించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పరిస్థితులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. ఈ క్రమంలోనే మృతుల బంధువులకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే అనంతరం ప్రధాని మోదీ కాంగ్రాలో ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివప్రతాప్ శుక్లా తదితరులతో సమావేశమయ్యారు. సహాయక, పునరావాస చర్యలను సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా వరద బాధితులను పరామర్శించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రం వెన్నంటే ఉంటామని.. వరద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు అన్ని విధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సైన్యం, రాష్ట్ర యంత్రాంగం సేవలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇదిలా ఉండగా.. వరద నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్ లో పర్యటించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బృందాల నివేదికలతో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన విజ్ఞప్తుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మోదీ తెలిపారు. అనంతరం పంజాబ్‌లో పర్యటించారు.

# గ్రూప్-1పై తీర్పు చెంపపెట్టు

**నిరుద్యోగులకు సమాధానం చెప్పాలన్న హరీష్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సర్కారు నిర్లక్ష్యానికి నిరుద్యోగులు బలవుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరవాలని, తెలంగాణ యు-ువతకు క్షమాపణ చెప్పాలన్నారు. గ్రూప్ 1 పరీక్ష మూల్యాంకనంలో అవకతవకలు.. పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ల జారీ, పరీక్ష ఫలితాల్లో అనుమానాలు, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు. లోప భూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న రేవంత్ రెడ్డి ఈ కోర్టు తీర్పుకు మీరు చెప్పే సమాధానం ఏమిటని ప్రశ్నించారు. హడావుడిగా పరీక్షలు నిర్వహించి, అవకతవకలకు పాల్పడ్డ నీ నిరాక్ష్యానికి విద్యార్థులు, నిరుద్యోగులు బలవుతున్నారు. నీ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరికి సిగ్గుతో తలదించుకో. తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పు అంటూ డిమాండ్ చేశారు.

# నిరుద్యోగులకు న్యాయం చేయాలి

**గ్రూప్-1 పరీక్షలు తిరిగి నిర్వహించాలి..**

**హైకోర్టు తీర్పు ఓ గుణపాఠం కావాలి**

**హైకోర్టు తీర్పును స్వాగతించిన కెటిఆర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :** టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక గుణ-పాఠమని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం లభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు నిజంగా హర్షించదగినది. గతంలో గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు సాక్షాధారాలతో సహా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, టీఎస్పీఎస్సీ మొండిగా వ్యవహరించింది. గ్రూప్-1 పరీక్షల్లోని అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడిన బాధితులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు 8 నెలలలోపు రీ-వాల్యుయేషన్ లేదా రీ-మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని కోరుతూ, తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పులకు బాధ్యత వహిస్తూ యువతకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మళ్లీ అప్పీళ్లు, కోర్టు కేసులు అంటూ యువతకు అన్యాయం చేయవద్దని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. విద్యార్థులు డిమాండ్ చేస్తున్న తీరుగా వెంటనే గ్రూప్ వన్ పరీక్షలను తిరిగి నిర్వహించి వేగంగా పూర్తి చేయాలని కేటీఆర్ కోరారు.

**జైరామ్ వ్యాఖ్యలు అహంకారపూరితం**

దేశ రాజకీయాలు కేవలం రెండు పార్టీలకే పరిమితం అన్నట్లుగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిరంతర వైఫల్యాలకు ప్రధాన కారణం ఇదేనని ధ్వజమెత్తారు. 'మాకు మద్దతివ్వకపోతే.. మీరు బీజేపీ పక్షాన ఉన్నట్లే' అనే అహంకారపూరిత వైఖరి దేశ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను ఒంటరిని చేసిందని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా కొన్ని పార్టీల వైఖరిపై జైరాం రమేష్ చేసిన ట్వీట్‌కు కేటీఆర్ ఘాటుగా బదులిచ్చారు. దేశం ఒకప్పుడు ఉన్నట్లుగా ఇప్పుడు రెండు ముక్కల దేశం కాదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు బీటీమ్ కాదని, బీజేపీకి కూడా బీటీమ్ కాదని తేల్చి చెప్పారు. తాము తెలంగాణ ప్రజల 'ఏటీమ్' అని స్పష్టం చేశారు. ప్రాంతీయ పార్టీలను రాజకీయ ఆటల్లోకి లాగే బదులు, తమ పార్టీ ఎదుర్కొంటున్న వైఫల్యాలపై దృష్టి పెట్టాలని జైరాం రమేష్‌కు హితవు పలికారు.

# హవాలా మార్గంలో నైజీరాయాకు డబ్బు

**ఈగిల్ దాడుల్లో 3కోట్ల పైచిలుకు డబ్బు స్వాధీనం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** పలు రాష్ట్రాల్లో తెలంగాణా ఈగల్ టీం స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. ముంబై, డిల్లీ, రాజస్థాన్, అహ్మదాబాద్, పుణె, హైదరాబాద్, గోవా ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి నైజీరియా సహా ఇతర దేశాలకు హవాలా ద్వారా నగదు పంపేందుకు సహకరిస్తున్న 20మందిని అరెస్ట్ చేసింది. నిందితులు మనీ లాండరింగ్ కు పాల్పడుతూ విదేశాల్లో ఉన్న డ్రగ్ డాన్లకు సహకరిస్తున్నట్లు- తేల్చారు. వీరంతా డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును నైజీరియా తరలిస్తున్నట్లు- గుర్తించారు. 20 మంది నిందితుల నుంచి ఇప్పటి వరకూ రూ. 3 కోట్ల 84 వేల హవాల డబ్బును స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. హైదరాబాద్ లో డ్రగ్స్ ను అరికట్టడానికి తెలంగాణ ప్రభుత్వం ఈగల్ టీ-ంను ఏర్పాటు- చేసిన సంగతి తెలిసిందే. ఇటీ-వల హైదరాబాద్ కేంద్రంగా ఫార్మా ముసుగులో పలు కంపెనీల్లో పెద్ద ఎత్తున డ్రగ్స్ తయారీ చేస్తున్న ముఠాను పోలీసులు ఛేధించారు. ఇక్కడ డ్రగ్స్ తయారు చేసి పలు రాష్ట్రాలు, దేశాలకు సరఫరా చేస్తున్నట్లు- తేల్చారు.

# ప్రజాకవి కాళోజీకి నివాళి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆమనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయనతో పాటు పలువు ఎంపీలు. కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతనం ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు బయలుదేరారు.









# స్థానిక సమరంపై మీనమేషాలు!

రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు జరగాల్సి ఉంది. తెలంగాణలో మాత్రం ఈ నెలాఖరులోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల పంచాయితీ తేలకపోవడంతో ప్రభుత్వం వెనకాముందూ ఊగిసలాడుతోంది. ఎపిలో మాత్రం ఇంకా ఎలాంటి అడుగు పడడం లేదు. ఇటీవల పులివెందుల,ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నిక మాత్రం పెద్ద ఎత్తున జరిపించారు. నిజానికి గ్రామాలను బలోపేతం చేయాలంటే సర్పంచ్‌లే కీలకం. కానీ గ్రామాలను బలోపేం చేసే విశగా ప్రభుత్వాల కార్యాచరణుండడం లేదు. గ్రామాలను తమ గుప్పిట్లో పెట్టుకుని రాజధాని నుంచి పాలిస్తున్నారు. గ్రామాలు ఆర్థికంగా బలోపేతం కాకుండా ప్రభుత్వాల మీద ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నది. సిఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెల్లగా అడుగులు వేస్తున్నా.. అనేక జటిల సమస్యలకు పరిష్కారం చూపేదిశగా పాలన సాగాల్సి ఉంది. అనేక గ్రామీణ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇదే సమయంలో విపక్ష బిఆర్ఎస్ కేవలం విమర్శక పాత్రకే పరిమితం అయ్యింది. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే జరుగనున్నాయి. సర్పంచ్, మండలాలు, జడ్పీల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికలు కూడా అధికార కాంగ్రెస్‌కు, విపక్ష బిజెపి, బిఆర్ఎస్‌లకు కీలకం కానున్నాయి. కిందిస్థాయిలో పట్టు సాధించాలంటే ఈ ఎన్నికల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పాలనాతీరులో మార్పు రావాల్సి ఉంది. మూస పాలనకు, తాయిలాలకు దూరంగా ఉండాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యక్రమాలు ఉండాలి. కొత్తగా రేషన్ కార్డులు ఇస్తోన్న ప్రభుత్వం.. ఉన్న రేషన్ కార్డుల్లో నకిలీవెన్ని అన్న గుర్తింపు చేయడం లేదు. రేషన్ కార్డుల ఏరివేత తరవాతనే కొత్త రేషన్ కార్డులు చేపడితే బాగుండేది. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు,సర్పంచ్‌లు కూడా బాధ్యతా రహితంగా వ్యవహరించడంవల్ల ఇంతకాలం గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగలేదు. కేంద్రం నేరుగా నిధులు ఇస్తోంది. అయినా వాటిని పక్కదారి పట్టించారు. వివిధ పథకాలతో సర్పంచ్‌లకు బాధ్యత లేకుండా చేస్తున్నపెత్తనాన్ని తగ్గించుకుని, స్థానిక సంస్థలకు రాజీవ్ హయాంలో ఇచ్చి సవరణల ప్రకారం అధికారాలను బదిలీ చేయాలి. సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేయడం సరికాదు. ఎపిలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా సర్పంచ్ వ్యవస్థను గత జగన్ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. సర్పంచ్‌లకు బాధ్యతలు లేకుండా చేయడం సరికాదు. ఎపిలో ఆర్బీకెలతో పెత్తనం సాగించారు. ఎన్నికైన సర్పంచ్‌ల ను డమ్మిలుగా చేస్తూ..వారికి నిధులు కేటాయించ కుండా..వారిని పనిచేయనీయకుండా పెత్తనం చెలాయిం చడంతో గ్రామాలు సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాలకు ఏమి అవసరమన్నది గుర్తించి నిధులు విడుదలచేసి, అమలు చేయించేలా కార్యాక్రమాలు సాగివుంటే ఆర్థికవ్యవస్థ ఎప్పుడో బలోపేతం అయ్యేది. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్దం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్దం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రలుగా తీర్చి దిద్దాలి. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ఉద్యోగులను పనిచేసేలా చేయాలి. అలాగే పనులకు సంబంధించి గ్రామాల్లో తీర్మానం చేయించి అమలు చేయించాలి. సిఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా అవసరమైతే ప్రణాళికలను అమలు చేయాలి. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. గ్రామాలను యూనిట్‌గా కార్యక్రమాల రచన సాగాలి. ప్రతి పనికీ సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం సాధిస్తుంది. అలాగే ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా పారిశుధ్య కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగతమైన శ్రద్దకు సంబంధించి నదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ద తక్కువనే చెప్పాలి. చెత్తను వీదుల్లో పడేయడం, కాలువల్లో పడేయడం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై బాధ్యత లేకుండా పోయింది. చెత్త ఎత్తేయడం అధికారుల పని అన్న భావనలో ప్రజలు ఉన్నారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, పర్యావరణపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగాలి. చైతన్యం చేయాలి. గ్రామస్థాయిలో పనులకు సర్పంచ్‌లను బాధ్యులను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు, పొలం ప్రాంతాలు, గ్రామాల శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా వేలాది రూపాయల వేతనాలుగా అందిస్తున్నారు. అయినా మార్పులు కానరావడం లేదు. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. సర్పంచ్‌లను, పంచాయితీల పాలకవర్గాలను విశ్వాసంలోకి తీసుకుని వారిని బాధ్యులను చేసినప్పుడే గ్రామాల రూపురేఖలు మారగలవు.

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎన్నిక

- 452 ఓట్లు పొందిన ఎన్డీయే కూటమి అభ్యర్థి
- ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు
- తొలి ఓటు వేసిన ప్రధాని మోడీ
- వీల్‌చైర్‌లో వచ్చి ఓటేసిన మాజీప్రధాని దేవేగౌడ










**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:** ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. పార్లమెంట్ నూతన భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఎన్నికల పోలింగ్ ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటలకు ముగియగా, ఓట్ల లెక్కింపు అనంతరం రాత్రి 7:30 గంటలకు ఫలితాలు వెలువరించారు. ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు- వచ్చాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికలో మొత్తం 97 శాతం పోలింగ్ నమోదైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేశారు. ఆ వెంటనే ఆయన వరద బాధత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌కు బయలుదేరారు. 768 మంది ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 13 మంది మినహా మిగతా ఎంపీలంతా ఓటు వేశారు. భారత రాష్ట్ర సమితి, బీజేడీ, శిరోమణి అకాళీదళ్ సభ్యులు ఓటు వేయలేదు. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టారు. 96 శాతం మంది సభ్యులు ఓటు- హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం పార్లమెంట్ భవనం లోపల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు-చేసింది. లోక్‌సభ,రాజ్యసభ సభ్యులు తమ ఓటు- హక్కును వినియోగించుకున్నారు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఎన్నుకుంటుంది. బ్యాలెట్ రహస్య ఓటు- ద్వారా జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత సాయంత్రం తర్వాత ఫలితాలు ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఓటింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ప్రధానిమోదీ మొదటి ఓటు వేశారు. రహస్య బ్యాలెట్ విధానం ద్వారా నిర్వహించే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంటు- సభ్యులు పార్టీ విప్‌లకు కట్టు-బడి ఉండరు. ఎన్నికలకు ముందు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ,కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు రెండూ తమ ఎంపీలతో ఈ పక్రియ గురించి వారికి వివరించడానికి సమావేశాలు నిర్వహించి మాక్ పోల్స్ నిర్వహించాయి. పార్లమెంటు ఉభయ సభల ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ క్యూలో నిలబడి ఓటు వేయడం అందర్నీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరామ్ రమేష్, శశిథరూర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ వీల్‌చైర్‌పై పార్లమెంటుకు వచ్చి ఓటు వేశారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కిరణ్ రిజిజు, చిరాగ్ పాశ్వాన్, కిషన్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాజ్యసభ డిప్యూటీ-చైర్‌పర్సన్ హరివంశ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ తదితర ప్రముఖులు ఓటు- హక్కును వినియోగించుకున్నారు. వివిధ కారణాల రీత్యా ఓటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు భారత్ రాష్ట్ర సమితి, బిజూ జనతాదళ్ , శిరోమణి అకాలీదళ్ ప్రకటించాయి. బీఆర్ఎస్‌కు నలుగురు రాజ్యసభ ఎంపీలు, బీజేడీకి ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, శిరోమణి అకాలీదళ్‌కు ఒక ఎంపీ ఉన్నారు.

# భారత్‌కు వ్యతిరేకంగా సెనేటర్ వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పాలని ప్రధాని సూచన

**సిడ్నీ, సెప్టెంబర్ 9:** భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సెనెటర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సూచించారు. ఆస్ట్రేలియాలో కొంతకాలంగా వలసదారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాలో పెరుగుతోన్న జీవనవ్యయాలకు భారత వలసదారులను నిందిస్తూ సెంటర్ రైట్ లిబరల్ పార్టీకి చెందిన సెనెటర్ జసింటా ప్రిన్స్ విమర్శలు చేశారు. తమకు ఓట్లు పడేలా భారతీయ వలసదారులను రప్పిస్తున్నారని ఈ సందర్భంగా ఆల్బనీస్‌కు చెందిన ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ పైనా ఆమె వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాకు వలస వచ్చిన భారతీయుల సంఖ్య భారీగా ఉంది. ఆ సంఖ్యను లేబర్ పార్టీకి వచ్చిన ఓటింగ్‌లో మనం చూడొచ్చని ప్రైస్ అన్నారు. ఈ వ్యాఖ్యలు ఆస్ట్రేలియన్-ఇండియన్ కమ్యూనిటీలో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి. వెంటనే ఆమె క్షమాపణలు చెప్పాలని వారంతా డిమాండ్ చేశారు. సొంత పార్టీ కూడా ఆమె వైఖరిని ఖండించింది. ప్రైస్ విమర్శలపై ఆల్బనీస్ స్పందించారు. భారత కమ్యూనిటీకి చెందిన ప్రజలను ఆ వ్యాఖ్యలు బాధించాయి. ఆమె వెంటనే క్షమాపణలు చెప్పాలి. ఆమె సొంత పార్టీ నేతలు కూడా అదే చెప్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. 2023 నాటికి భారత సంతతికి చెందిన 8,45,800 మంది ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. గత దశాబ్దకాలంతో పోలిస్తే అది రెట్టింపు సంఖ్య. ఈ నిరసనల నేపథ్యంలో కమ్యూనిటీ గ్రూపులతో న్యూసౌత్ వేల్స్ ప్రభుత్వం సమావేశం నిర్వహించింది. భారత వలసదారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఇక ఈ పరిణామాలను భారత విదేశాంగ శాఖ సునిశితంగా పరిశీలిస్తోంది. ఎప్పటికప్పుడు ఆస్ట్రేలియా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

# పాట్నా-ఢిల్లీ మధ్య వందేభారత్ స్లీపర్ ట్రైన్

## బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్లాన్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:** వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును భారతీయ రైల్వేశాఖ ప్రారంభించ నున్నది. ఢిల్లీ నుంచి పాట్నా మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించేందుకు ఆ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ రైలు ప్రయాగ్‌రాజ్ మీదుగా వెళ్తుంది. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వందేభారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ భావిస్తున్నట్లు-తెలుస్తోంది. నవంబర్ 22వ తేదీన ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగుస్తుంది. అయితే ఆ తేదీలోగానే ఎన్నికల కమిషన్ ఎన్నికల పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. నవంబర్ 15లోగా ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు కేవలం డే జర్నీ వందేభారత్ రైళ్లను మాత్రం నడుస్తున్నాయి. అయితే వందేభారత్ స్లీపర్ రైళ్ల వల్ల రాత్రి జర్నీ కూడా సుఖంగా సాగనున్నది. దీపావళి సీజన్ సందర్భంగా ఆ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఢిల్లీ, పాట్నా మధ్య ప్రయాగ్‌రాజ్ మార్గంలో వెళ్లే వందేభారత్ రైలు కేవలం 11.5 గంటల్లో తన జర్నీ పూర్తి చేస్తుంది. అయితే ఇదే మార్గంలో వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు 23 గంటల సమయం పడుతోంది. బీఎంఈఎల్ కంపెనీ వందేభారత్ స్లీపర్ రైలును ఉత్పత్తి చేస్తున్నంది. ప్రస్తుతం రాజధాని ఎక్స్‌ప్రెస్, తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ట్రావల్ ఆప్షన్ల కంటే ఆధునిక రీతిలో వందేభారత్ స్లీపర్ రైలును ప్రవేశపెడుతున్నారు. ఆ రైలు గంటకు సుమారు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. వందేభారత్ స్లీపర్ రైళ్లలో కేవలం 16 కోచ్‌లు ఉంటాయి. వీటిల్లో 11 ఏసీ-3 -టైర్ కోచ్‌లు, రెండు ఏసీ 2 -టైర్, ఓ ఏసీ ఫస్ట్‌క్లాస్ కోచ్ ఉంటుంది. సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్ డోర్లు ఉన్నాయి.

# నేపాల్‌లో ఆందోళనలు తీవ్రం

## మంత్రి బిష్ణుప్రసాద్‌ను తరిమికొట్టిన జనం

## మాజీప్రధాని ఇంటికి నిప్పపెట్టడంతో సతీమణి సజీవ దహనం



**ఖాట్మండ్, సెప్టెంబర్ 9:** సోషల్ మీడియా బ్యాన్‌తో నేపాల్‌లో ఆందోళనలు ఎగిసిపడుతున్నాయి. జెన్ జెడ్ యువత ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. సోమవారం భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో 19 మంది మరణించడం అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది. ఆందోళనకారులు ప్రధాని కేపీ శర్మ ఓలి నివాసంతో పాటు అధ్యక్ష, సుప్రీంకోర్టు, పార్లమెంట్ భవనాలపై దాడి చేసి, నిప్పటించారు. ఇదిలా ఉంటే, నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయి. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడెల్ (65) ఖాట్మాండు వీధుల్లో ఉరికించి కొట్టారు. మాజీ ప్రధాని ఝులనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పటించారు. ఇంటిలో ఉన్న ఆయన భార్య కాలిన గాయాలతో మరణించారు. మాజీ ప్రధాని భార్య రాజ్యలక్ష్మి చిత్రాకార్ మంగళవారం సజీవదహనం అయ్యారని పలు రిపోర్టులు చెబుతున్నాయి. నిరసనకారులు ఆమెను తన ఇంట్లో బంధించిన ఇంటికి నిప్పటించారు. ఈ సంఘటన రాజధాని ఖాట్మాండులోని డల్లు ప్రాంతంలో జరిగింది. చిత్రకర్‌ను కీర్తిపూర్ బర్న్ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మరణించారు.

# బాసరలో శరన్నవరాత్రి ఉత్సవాలు

**బాసర, సెప్టెంబర్ 9:** బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్22వ తేది నుంచి దసరా మహోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. అక్టోబర్ 3వ తేది వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులు ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. భక్తులకు అవసరమైన వసతి సౌకర్యాలు గురించి చర్చించారు. అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలు, వివిధ మండపాలకు ప్రతి ఏడాది మాదిరిగానే విద్యుత్‌దీపాలతో అలంకరించాలని అందుకు సంబంధించి పనుల కోసం టెండర్లు పిలవాలని నిర్ణయించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు,అక్షరాభ్యాసాలకు లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇవో తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
10 సెప్టెంబర్
2025





## కెసిఆర్ ఆశీస్సులు తీసుకున్న రవీందర్ రావు



ఎర్రవెల్లి, రోమింగ్ న్యూస్: తన పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ను ఎర్రవెల్లి నివాసంలో కుటుంబ సమేతంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు. ఈ సందర్భంగా రవీందర్ రావు కు టిఆర్ఎస్ అధినేత పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## లయన్ సామ శ్రీధర్ సేవలు అభినందనీయం : వంగపల్లి అంజయ్య స్వామి

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ సామ శ్రీధర్ కు బెస్ట్ సర్వీస్ అవార్డ్**



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 డి లో 2024 - 25 సంవత్సరంలో మీల్స్ ఆన్ వీల్స్ బెస్ట్ అవార్డు సర్వీస్ అవార్డ్ అందుకున్న లయన్ సామ శ్రీధర్, హైదరాబాదులో లయన్స్ క్లబ్ వివిధ రంగాల లో సేవలు అందించిన వారికి హైదరాబాద్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు అందులో భాగంగా లయన్ సామా శ్రీధర్ చేసిన విశేష సేవలను గుర్తించి మీల్స్ ఆన్ వీల్స్ బెస్ట్ సర్వీస్ అవార్డ్ అందుకోవడం అభినందనీయమని వారిని అభినందించిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ సామ శ్రీధర్ సేవలు అభినందనీయం అని, మీల్స్ ఆన్ వీల్స్ బెస్ట్ సర్వీస్ అవార్డ్ అందుకోవడం అభినందనీయమని అన్నారు వారు ఇలాంటి అవార్డులు మరిన్ని అందుకోవాలని అన్నారు,అనంతరం లయన్ సామ శ్రీధర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో నేను సైతం భాగస్వామ్యం కావడం, నా సేవలు గుర్తించి నాకు అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్క లైన్స్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు,

## జనగామ కాళోజి గ్రంథాలయంలో కాళోజి జయంతి వేడుకలు




సంస్థాన్ నారాయణ పురం, రోమింగ్ న్యూస్: గ్రంథాలయ అధ్యక్షులు అందోజు నాగభూషణము మాట్లాడుతూ లితెలంగాణ తొలి పొద్దు కాళోజి . ప్రతి నిమిషం పోరాటాన్ని శ్వాసించి కవిత్వించిన వ్యక్తి .నేను ప్రస్తుతాన్ని, నిన్నటి స్వప్నాన్ని ,రేపటి జ్ఞాపకాన్ని అని నినాదించిన అదంతా ఆయన జీవన తత్వానికి నిదర్శనమే. ఈ మహా మనిషిని స్మరించుకోవటం ఎంతైనా ముఖ్యం. ఈరోజు కాలోజీ జయంతి .తెలంగాణ ప్రజల ఉద్యమం ప్రతిధ్వని కాలోజి. రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం కాళోజి. కవిత్వం రాసిన , ప్రజాకవి హక్కులు అడిగిన ప్రజల మనిషి .ఉద్యమం నడిపిన ప్రజావాది. తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి .పుట్టుక చావులు కాకుండా బతుకంతా తెలంగాణకు ఇచ్చిన మహనీయుడు. తెలంగాణ వైతాళికుడు కాళోజి .సామాన్యుల జీవనం కళ్ళ ముందు కదలాడుతుంది .కథ రాసిన కవిత్వం చెప్పిన వర్తమాన పరిస్థితులపై ఆవేదన చెందిన తానే చెప్పినట్టు సామరస్యం స్వభావానికి సరిపడదు కాబట్టి అడుగడుగునా సంఘర్షణ అంటూ తన మానసిక సంఘర్షణలో , నా గొడవ అన్న సమాజం కోసమే సమాజ చైతన్య కోసమే పోరాటం చేసాడు. తెలంగాణ ప్రజాకవి .అక్షరమే ఆయుధంగా ఎక్కుపెట్టిన కాళోజిలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర రాములు,స్వప్న, లావణ్య, రేణుక, రాణి,మహేశ్వరి, స్పందన, శివాని,పూజ,పద్మ, ధనమ్మ,స్వాతి,స్పందన,వనిత మొదలైన వారు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్ డి క్యాంపుకు సెలెక్ట్ కేయూ మహిళా ఇంజనీరింగ్ విద్యార్థిని



కేయూ, రోమింగ్ న్యూస్: మహిళా ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విభాగం నుండి అక్షయ పొన్నం సిఎస్ఇ బ్రాంచ్ నుండి ఎంపిక అవడం జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె ప్రతాపరెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మరియు అకుట్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి వెంకట్రాం రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భిక్షాలు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తూర్పాటి వెంకటేష్ ,పి రచన కళాశాల సూపరిండెంట్ వీరు నాయక్ లు అభినందనలు తెలిపారు.

# నేటి తరానికి ఆదర్శం కాళోజి: జూపల్లి





**రవీంద్రభారతిలో ఘనంగా**

**ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు**

**ప్రజాకవిని స్మరించుకొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవికి కాళోజీ సాహితీ పురస్కారం ప్రదానం**

హైదరాబాద్, సెప్టెంబర్ 9:(రోమింగ్ న్యూస్): తెలంగాణ ఉద్యమకారులకు గొప్ప స్ఫూర్తినిచ్చిన ప్రజాకవి కాళోజీని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతి కశాఖ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతి వేడుకలను, తెలంగాణ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవికి కాళోజీ సాహితీ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ప్రజాకవిగా అలుపెరగని పోరాటం చేసిన గొప్పకవి కాళోజీ అని ఘనంగా నివాళులు అర్పించారు. అందరికీ తెలంగాణ భాష దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ .. కాళోజీ తన జీవితకాలంలో జరిగిన ప్రతి ఉద్యమాన్నీ ఊపిరిగా మార్చుకుని, వాటిలో తన వంతు పాత్రను చురుగ్గా పోషించారు అన్నారు. సమకాలీన సమాజంపై ఆయన ప్రభావం అపారమైనదని, మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావు లాంటి వారు కాళోజీ అంటే అమితమైన గౌరవాభిమానాలు చూపేవారని చెప్పారు. సమాజ గొడవను తన గొడవగా మార్చుకుని నా గొడవ పేరుతో ఘోసిన కవితలు సమాజానికి మార్గదర్శకాలుగా మారాయని తెలిపారు. ప్రాణం ఉన్నంతవరకు తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప ప్రజాకవి అని, ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించి, చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయిన మహానుభావుడని ఆయన సేవలను కొనియాడారు. ప్రజాకవి కాళోజీ జీవిత చరిత్ర గ్రంథాలను అందరికీ తెలియజేసేలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో, గ్రామాల్లో ఉండే విధంగా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమాలకు యువత దూరంగా ఉండటం బాధాకరమని, మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో మునిగితేలుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాళోజీ ఫౌండేషన్ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస రావు, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తదితరులు పాల్గొన్నారు.

# మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారు!!

**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మీ పాత్ర ఎక్కడ బిజెపి సమాధానం చెప్పాలి...**

**వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర చెరిపివేస్తే చెరిగిపోయేది కాదు..**

**పేదలకు భూ పంపిణీ చేసి ఆత్మగౌరవాన్ని పెంచింది కమ్యూనిస్టులే..**

**4000 మంది కమ్యూనిస్టు యోధుల బలిదానమే వీర తెలంగాణ పోరాటం...**

**బి వి.రాఘవులు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు**



భువనగిరి, రోమింగ్ న్యూస్: మహోన్నత వీర తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్రహీనులవుతారని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మంగళవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో "వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం" ప్రజా విజయాలు-వాస్తవాలు-వక్రీకరణలు అనే అంశంపై సిపిఎం జిల్లా ప్రజా సదస్సు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ అధ్యక్షతన జరిగింది ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవి. రాఘవులు బీవి,రాఘవులు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం ప్రపంచంలో ఎన్నో పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు నాడు తెలంగాణ ప్రాంతంలో దొరలు, జాగిర్దారులు, పటేల్ పట్వారిలు, నైజాం రజాకారు యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి జరిపిన మహోన్నత పోరాటమన్నారు ఈ పోరాటం దోపిడీ, పీడనలను,వెట్టి చాకిరిని నిర్మూలించడమే కాకుండా ప్రజలకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందన్నారు సుమారు 4000 మంది రక్త తర్పణతో లక్షలాధి ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిందన్నారు నాడు విసునూరు రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప్ రెడ్డి లాంటి దుర్మార్గులను తరిమికొట్టిన చరిత్ర సాయుధ రైతాంగ పోరాటమన్నారు ఆ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులు మాత్రమేనని పోరాట చరిత్రను గుర్తు చేశారు. కమ్యూనిస్టుల నాయకత్వాన 3000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు సాధించిపెట్టిందనారు ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని కాపాడిందన్నారు,భూ పంపిణీ ద్వారా లక్షలాది మంది పేదలకు భూమిని సాధించి పెట్టిందన్నారు,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడే ధైర్యాన్ని అందించిందన్నారు 1946 లోనే మహిళలకు సమాన అవకాశాలు ఇచ్చి మహిళల్ని కథనరంగంలో కార్యోన్ముఖులను చేసి వారిని నాయకత్వ స్థానంలోకి తీసుకువచ్చిందన్నారు మల్లు స్వరాజ్యం,ఆరుట్ల కమలాదేవి లాంటి వీరనారులను తయారు చేసిందన్నారు పేదలకు, ముఖ్యంగా మహిళలకు విద్యను అందించే విషయంలో ఆంధ్ర మహాసభ నాయకత్వంలో వయోజన విద్యాను ప్రారంభించి లక్షలాది గ్రామాల్లో చదువు చెప్పిందన్నారు ఈ పోరాటం ద్వారా అనేకమంది కవులు కళాకారులు ముందుకు వచ్చారని బండి యాదగిరి,సుద్దాల హనుమంతు,సి నారాయణరెడ్డి,కాలోజి నారాయణరావు లాంటివారు అనేకమంది సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు ఘనమైన చరిత్ర కలిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లింలు గొడవగా వక్రీకరణ చేయాలని భావిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ లకు ఈ పోరాటంతో ఎలాంటి సంబంధం లేదన్నారు.

వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారని అన్నారు 4000 మంది కమ్యూనిస్టు యోధుల బలిదానమే వీరోచిత సాయిధర రైతాంగ పోరాటమని గుర్తు చేశారు నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడుతున్న సమయంలో బ్రిటిష్ వారివంతన చేరిన గాడ్సే సావర్కర్ల వారసులు బిజెపి ఆర్ఎస్ఎస్ సంగుపరివారశక్తులు అన్నారు ప్రపంచ చరిత్రలో వీరోచిత స్థానం కలిగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఎవరో చెరిపేస్తే చెరిగిపోయేది కాదని ఆ చరిత్రను ముందుకు తీసుకెల్లే అనేకమంది నాటి పోరాట వారసులు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఉన్నారన్నారు ప్రజలు ఉన్నంతవరకు ఈ చరిత్ర ఉంటుందని ఈ పోరాట చరిత్రను గ్రామ గ్రామాన నేటి తరానికి అందించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై వారి వారసులపై ఉందన్నారు

ఈ సందర్భంగా మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఉన్న పల్లె,పల్లెకు, చెట్టుకు, పుట్టకు ఒక చరిత్ర ఉందని ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు తాతల, తండ్రుల వారసత్వం కలిగి ఉందని చరిత్రను వక్రీకరించాలని చూస్తున్న బిజెపికి ఏముందో చూపెట్టగలరా అని ప్రశ్నించారు!!

సాయుధ పోరాట చరిత్ర స్ఫూర్తితో నాడు జాగీర్దారులు,పటేల్,పట్వారిలకు, రజాకార్ మూకలకు వ్యతిరేకంగా పోరాడినట్లే నేడు దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాదంపై పోరాడాలని మత చిచ్చు రేపి తమ పబ్బము గడుపుకోవాలని చూస్తున్న మతోన్మాదముకలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుల వారమవుతామని, మతోన్మాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు

ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం,దాసరి పాండు, గుంటోజు శ్రీనివాసచారి,

సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, పైళ్ల యాదిరెడ్డి,గద్దె నర్సింహా

జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, ఎండి పాషా, బొడ్డుపల్లి వెంకటేశం,గుండు వెంకట నర్సు, గంగదేవి సైదులు,దోడ యాదిరెడ్డి,మద్దేపురం రాజు, బోలగాని జయరాములు, అవ్వారు రామేశ్వరి,రాచకొండ రాములమ్మ,యంఏ.ఇక్బాల్ వనం ఉపేందర్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేశం, రాగిరు కిష్టయ్య, మల్లెపల్లి లలిత, బల్గూరి అంజయ్య, కోట రామచంద్రారెడ్డి, గోశిక కరుణాకర్, పైళ్ల గణపతి రెడ్డి, దూపటి వెంకటేష్,ర్యాకల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, వేముల బిక్షం, గాడి శ్రీనివాస్, కొల్లూరు ఆంజనేయులు, బుర్రు అనిల్,నూకల భాస్కర్ రెడ్డి, రామచంద్రం వివిధ మండల పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్

కొడకండ్ల, రోమింగ్ న్యూస్: తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి ఐదుగురు రాజ్యసభ సభ్యులు ఉన్నప్పటికీ, దేశంలో అత్యున్నత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయకుండా దూరంగా ఉండటం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ధర్మారపు బిక్షపతి కొడకండ్ల పట్టణ శాఖ అధ్యక్షులు మసురం రవీందర్ కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశ గాని నాగరాజు అన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల కెసిఆర్ కేటీఆర్ బిఆర్ఎస్ పార్టీ చూపిన ఈ నిర్లక్ష్యం భారతదేశ స్థాయిలో తెలంగాణ ప్రజల గౌరవాన్ని దిగదార్చిందన్నారు రాజ్యాంగ విలువలత తరపున పార్లమెంట్‌లోకి వెల్లి ప్రమాణం చేసిన వారు, దేశానికి అత్యంత కీలకమైన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోకపోవడం అనేది దేశ ద్రోహం తప్ప మరొకటి కాదని ఆయన అన్నారు బాధ్యతను వదిలేసి




పారిపోయిన ఈ తీరుతో బిఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర గౌరవానికీ తూట్లు పొడిచిందన్నారు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం రాజకీయాలు అన్న మాటలు కేటీఆర్ కెసిఆర్ లకు నోట్లో మాటలే కానీ పనిలో లేవని ఈ ఘటన నిరూపించిందన్నారు ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రతినిధులు, ప్రజాస్వామ్యానికి సంబంధించిన కీలక నిర్ణయాల్లో పాల్గొనకపోవడం తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లన్నారు ఈ ఘోర వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇకనైనా బారాస పార్టీ నాయకులు తమ బాధ్యతను గుర్తించి, రాష్ట్ర ప్రతిష్టను కాపాడే విధంగా నడుచుకోవాలి. లేనిపక్షంలో తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని చదువు చూడాల్సి వస్తుందన్నారు కాలేశ్వరం అవినీతి పనుల్లో సిబిఐ ఎంక్వయిరీ నుంచి తప్పించుకునే అందుకే కేటీఆర్ కేసీఆర్ భరోసా ఉపరాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉందని ఆయన అన్నారు పార్టీ అధిష్టానం విప్ కు సంబంధం లేకుండా ఓటు వేసే హక్కు కలిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాజ్యసభ ఎంపీలు ఓటు హక్కుల పాల్గొని తెలుగు బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# ఉత్తమ పర్యావరణ వేత్త కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి

**“ఈపీడీసి జాతీయ సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డికి అరుదైన గౌరవం**

**అవార్డు ప్రకటించిన తెలంగాణ మేధావుల ఫోరం.**

**పర్యావరణ పరిరక్షణకు నిరంతర కృషి.**

**3 దశాబ్దాలకు పైగా కొనసాగిస్తున్న విద్యావేత్త.**

హైదరాబాద్ - రోమింగ్ న్యూస్ :
ఈపీడీసి జాతీయ సలహాదారులు, ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త లయన్. డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డిని ఉత్తమ పర్యావరణవేత్త అవార్డు %-% 2025కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మంగళవారం తెలిపారు. విద్య, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ రంగాలలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఏళ్లుగా పర్యావరణ సంరక్షణ భావజాలం**

పర్యావరణ పరిరక్షణలో 25 ఏళ్ల సేవలు

గత 25 సంవత్సరాలుగా డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఓజోన్ పొర పరిరక్షణ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులు, యువతను చైతన్యపరుస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు, అవగాహన ర్యాలీలు, శిబిరాలు, ప్రచార కార్యక్రమాలను ఆయన



విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**పలు రంగాల్లో గోపాల్ రెడ్డి సేవలు**

మాజీ గ్రీన్ అంబాసిడర్ ఆఫ్ తెలంగాణగా, జాతీయ పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి సలహాదారుగా, లోటస్ ల్యాప్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్‌గా గోపాల్ రెడ్డి సమాజానికి సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక్కరికే ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక అవార్డును సెప్టెంబర్ 16, 2025న అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అందజేస్తామని ఫోరం వెల్లడించింది. అంతేకాక, 2023 డిసెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో జరిగిన Greening Education Hub - (Erth), Legacy from the Land of Zayed" COP 28 కార్యక్రమంలో వక్తగా ఆయన పాల్గొన్నారు.

**సామాజిక సేవలకు గుర్తింపు....**

మానవ హక్కుల రక్షణ, నిరుపేదలకు విద్యాభివృద్ధి, బాల కార్మిక నిర్మూలన వంటి అంశాలపై ర్యాలీలు, సదస్సులు, క్విజ్ పోటీలు నిర్వహించి ఎన్నో పురస్కారాలు పొందారు. మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా జాతీయ పురస్కారం కూడా అందుకున్నారు. మొక్కలు నాటడం, ఆరోగ్య శిబిరాలు, నిరుపేదలకు సహాయం చేయడంలో ఆయన ముందున్నారు. ఇటీవల నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేసి ప్రజాసేవకు తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

“దక్షిణాది న్యూస్” డైలీ వార్తాపత్రికకు అసోసియేట్ ఎడిటర్‌గా, NISA జాతీయ కోఆర్డినేటర్‌గా, రైతు హక్కుల సాధన సమితి జాతీయ సలహాదారుగా, అలాగే తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు పొందిన విద్యాసంస్థల నేషనల్ సలహాదారుగా పనిచేస్తూ, ఉత్తమ ఉపాధ్యాయుడిగా మరియు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అనేక పురస్కారాలను అందుకున్నారు. కాగా ఈ అవార్డు ఆయన నిస్వార్థ సేవలకు, సమాజ అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపు అని తెలంగాణ మేధావుల ఫోరం పేర్కొంది. ఈ నెల 15 న నిర్వహించే “ప్రపంచ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవం “ సందర్భంగా అవార్డు ప్రదానం చేయనున్నారు.

# వర్టూరు పల్లెనిద్రలో బీర్ల

**నాడు కేసీఆర్....నేడు బడుగుల ముద్దు బిడ్డ అయిలయ్య**

**పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



మోటకొండూర్, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం వర్టూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. పల్లె నిద్ర కార్యక్రమానికి వట్టూరు గ్రామానికి విచ్చేసిన బీర్ల ఐలయ్యకు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు.మంగళహారతులు ఇచ్చి,డప్పు... డోలు వాయిద్యాల, కోలాటాల మధ్య స్వాగతం పలికారు. పల్లె నిద్రలో భాగంగా గతంలో కేసీఆర్ పల్లె నిద్ర పేరుతో ఆడెపు యాదమ్మ - యాదయ్య,సుదర్శన్ కుటుంబాన్ని మరిచిపోయి వదిలేసిన ఆ దళిత కుటుంబానికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భరోసాగా నిలిచి ఆ కుటుంబ ఇల్లును సందర్శించి ఇందిరమ్మ ఇల్లు ధ్రువపత్రం ఇచ్చారు.. దళితవాడలో పల్లెనిద్రలో భాగంగా ఆ కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, అక్కడే బస చేసి ఉదయం మార్నింగ్ వాక్ లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల ధ్రువపత్రాలు పంపిణీ చేసి ముగ్గు పోసి భూమి పూజ చేయనున్నారు.

# జనగామలో ఘనంగా కాళోజి జయంతి

**జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రముఖుల నివాళులు**

జనగామ,సెప్టెంబర్ 9: ( రోమింగ్ న్యూస్) తన రచనలు, మాటలు , పాటల తూటాలతో తెలంగాణ ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతిని మంగళవారం జనగామ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ భాషా డిసిపి రాజమహేంద్ర నాయక్ ల తో పాటు అనేకమంది ప్రముఖులు కాళోజీకి నివాళులు అర్పించారు. మంగళవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్,బెన్ష లోమ్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగాహా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పలువురు పాల్గొన్నారు



# నయనానందకరంగా హనుమంతుడికి ‘నాగవల్లి దళార్చన’



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆలయ క్షేత్రపాలకుడైన హనుమంతుడకి ‘నాగవల్లి దళార్చన’ను ఆలయ అర్చకులు మంగళవారం నయనానందకరంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి పక్కన ఉన్న హనుమాన్ టెంపుల్ లో ఆంజనేయస్వామి మూలవిరాట్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట స్వామివారి మూలవిరాట్ ను పవిత్ర జలంతో శుద్ధి చేసి మన్యసూక్త పారాయణాలతో అభిషేకం చేశారు. సింధూరంతో పాటు పలు రకాల సుగంధ ద్రవ్యాలు, పూల మాలలతో హనుమంతుడని అందంగా అలంకరించి ఆకుపూజ నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన తమలపాకులతో స్వామివారికి నాగవల్లి దళాలతో అర్చించారు. అనంతరం స్వామివారికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటిపండ్లను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా మంగళవారం ఆలయానికి రూ. 13,70,794 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# ఆధ్యాత్మిక చింతనతో అనుకున్నది సాధించవచ్చు

**యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్**

**వినాయక నిమజ్జనంలో పాల్గొన్న ఏసీపీ, సీఐ**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఆధ్యాత్మిక చింతనతో అనుకున్నది సాధించవచ్చునని యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో సాయిరాం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవంలో యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిరాం యూత్ ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వాతావరణంలో నిమజ్జన మహెూత్సవాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. గొడవలు, తగాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కల్లెం జహంగీర్ గౌడ్, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ యాకూబ్, సాయిరాం యూత్ నిర్వాహకులు కోల శ్యామ్ గౌడ్, కోల కృష్ణ గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సత్యప్రకాశ్ గౌడ్, సాయిరాం యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# జలాల్ పూర్ లో మెగా హెల్త్ క్యాంప్, స్టెమ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: బొమ్మలరామారం మండలం జలాల్ పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మొదలైన మెగా హెల్త్ క్యాంప్ మంగళవారం ముగిసింది. రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్(ఆర్కేఎస్సీ) ఆధ్వర్యంలో దివీస్ లాబొరేటరీస్ నిర్వహణలో సామాజిక అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన హెల్త్ క్యాంప్ లో మహిళలు, వృద్ధులు సహా పలువురు చిన్నారులకు సైతం హెల్త్ చెకప్ చేసి అవసరమైన వారికి మెడిసిన్స్ అందజేశారు. ఈ హెల్త్ క్యాంప్ లో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, సోలిస్ ఐ కేర్ హాస్పిటల్, ఎంఏఏ ఈఎన్టీ హాస్పిటల్, స్మైల్ గార్డ్ డెంటల్ హాస్పిటల్, జీనియా హాస్పిటళ్లు ప్రజలకు విశేషమైన వైద్య సేవలు అందించాయి. అవుట్ రీచ్ లో భాగంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో కలిసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా 15 సంవత్సరాలు పైబడిన అక్షరాస్యత లేని మహిళల్లో ప్రాథమిక శాస్త్రీయ జ్ఞానం పెంపొందించే ప్రత్యేక స్టెమ్(%బుజువీ%) ఎడ్యుకేషన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏసీపీ రాహుల్ రెడ్డి, రూరల్ సీఐ చంద్రబాబు, బొమ్మలరామారం ఎస్ఐ శ్రీశైలం యాదవ్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ రఘువీర్, జాయింట్ సెక్రటరీ, సీడీసీ డైరెక్టర్ వాసుదేవ్ రావు, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, బొమ్మలరామారం ఎంఈవో రోజారాణి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నిర్మల జ్యోతి తదితరులు ఉన్నారు.

# యాదగిరిగుట్ట పీహెచ్సీలో గుండెపోటుతో వ్యక్తి మృతి

**బీపీ, పల్స్, హార్ట్ బీట్ నార్మల్ రావడంతో ఈసీజీ టెస్ట్ రాసిన డాక్టర్లు**

**టెస్ట్ కోసం వెళ్ళి పీహెచ్సీ ప్రాంగణంలో బెంచీపై పడిపోయిన చంద్రశేఖర్**

**పల్స్ లేకపోవడంతో 15 నిమిషాలు సీపీఆర్ చేసిన డాక్టర్లు**

**భువనగిరి ఏరియా హాస్పిటల్ తరలించగా చనిపోయాడని నిర్ధారించిన డాక్టర్లు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: గుండెనొప్పి రావడంతో ట్రీట్‌మెంట్ కోసం యాదగిరిగుట్ట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓ వ్యక్తి మంగళవారం గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. యాదగిరిగుట్ట మండలం సాదువెల్లి గ్రామానికి చెందిన మార్గం చంద్రశేఖర్(45) కు భార్య, ఒక కూతురు ఉండగా.. యాదగిరిగుట్టలో ఓ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు.. ఈ క్రమంలో సాదువెల్లి గ్రామం నుండి రోజులాగే ఉదయం తన కూతురును యాదగిరిగుట్టలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వదిలిపెట్టాడు. దాదాపుగా ఉదయం 11:20 గంటల సమయంలో చాతిలో నొప్పి లేవడం, చెమటలు విపరీతంగా వస్తుండడంతో.. వెంటనే ట్రీట్‌మెంట్ కోసం పాలిటెక్నిక్ కళాశాల పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. డాక్టర్లు వెంటనే బీపీ, పల్స్, హార్ట్ బీర్ట్ చెక్ చేయగా.. అన్నీ నార్మల్‌గా నమోదయ్యాయి. చాతిలో నొప్పి తగ్గిపోవడంతో ఈసీజీ టెస్ట్ చేపించుకుని రావాలని డాక్టర్లు సూచించి ప్రిస్క్రిప్షన్ రాశారు. ఈసీజీ టెస్ట్ చేయించుకోవడం కోసం పీహెచ్సీ నుండి బయటకు వెళ్లిన చంద్రశేఖర్.. నీరసంగా ఉండడంతో పీహెచ్సీ ఆవరణలో ఉన్న సిమెంట్ బెంచీపై



కూర్చున్నారు. ఈ క్రమంలో సిమెంట్ బెంచీపైనే పడిపోయి ఫిట్స్ వచ్చినట్లుగా చేస్తుండడంతో.. గమనించిన అక్కడే ఉన్న పేషెంట్లు పీహెచ్సీ లోపల ఉన్న డాక్టర్లకు సమాచారం ఇచ్చారు. వెంటనే డాక్టర్లు వచ్చి బీపీ, పల్స్ చెక్ చేయగా ఏం రికార్డు కాకపోవడంతో.. గుండెపోటుగా గుర్తించిన డాక్టర్లు వెంటనే సీపీఆర్ స్టార్ చేశారు. అయినా బాడీ రెస్పాండ్ కాకపోవడంతో.. అంబులెన్స్ కు ఫోన్ చేసి అంబులెన్స్ వచ్చేంత వరకు సీపీఆర్ చేస్తూనే ఉన్నారు. అయినా బాడీలో ఎలాంటి కదలికలు లేకపోవడం, పీహెచ్సీలో ఈసీజీ టెస్టుల సదుపాయం లేకపోవడంతో.. వెంటనే భువనగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. అక్కడ బాడీని పరీక్షించిన డాక్టర్లు.. ఈసీజీ టెస్ట్ కూడా చేసి చనిపోయాడని నిర్ధారించారు. కాగా మృతుడు చంద్రశేఖర్ కు గతంలోనే ఒకసారి గుండెపోటు రాగా.. ట్రీట్‌మెంట్ తీసుకుని వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు కూడా వాడుతున్నట్లు తెలిసింది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986